# పెళ్లి చూపులు

పార్వతమ్మ వీధిలోనుంచి రాగానే "అమ్మాయీ. సులోచనా స్నానంచేసి మంచి బట్టలు వేసుకుని తలదువ్వుకుని సిద్ధంగా ఉండు. నేనింతలోకి వాకిలి గది ఊడ్చి చాపలేస్తాను." పెరట్లోకి వెళ్ళి చీపురు అందుకుంది.

సులోచన ముఖం చిట్లించింది.

"ఎందుకా ముఖం చిట్లింపు? తొందరగా తయారుకా. పొద్దున్నే సుబ్బయ్య వచ్చి చెప్పాడు-"ఇద్దరు పెద్దవాళ్ళు అబ్బాయీ వస్తారని"

సులోచన స్నానానికి వెళ్ళింది. ఎంతకాలం నుంచో దాచి ఉంచిన సబ్బుతో స్నానం చేసింది. ఎప్పటిదో పెట్టెలో మడత పెట్టి పెట్టిన లేతాకుపచ్చ చుక్కల చీరెకట్టుకుంది. దానికి తగిన జాకెట్టు వేసుకుంది. భరిణెలో భద్రంగా దాచి ఉంచిన పౌడరు ముఖానికి అద్దుకుంది. అంటీ అంటనట్టు కళ్ళకు కాటుక పెట్టుకుంది. దోసగింజలాంటి ఎర్రటి బొట్టు కనుబొమలపైన అంటించుకుంది. కిటికీలోని అట్ట డబ్బాలో ఉన్న గాజులు నాలుగేసి వేసుకుంది నకిలీ ముత్యాల కమ్మలు జుంకీలు పెట్టుకుంది. తలవెంట్రుకలు దువ్వుకొని ఒదులుగా జడల్లుకుని తల్లి యిచ్చిన జాజిపూల దండ పెట్టుకుంది. ఇది పెళ్ళిచూపుల సందర్భంలో ఆమె చేసుకునే అలంకారం.

ఒక్కసారి అద్దం ముందర మళ్లీ నిలబడ్డది.

చీరె పాతదీ వెలిసిపోయినది అయితేనేం-నకిలీ నగలు పెట్టుకుంటేనేం-గుండ్రటి ముఖం, చురుకుగా చూసే విశాలమైన కళ్ళు, వొంపు తిరిగిన పెదవులూ, కొనదేలిన గడ్డం ముఖానికి అందాన్నిచ్చేవే-గాని అందవిహీనం చేసేవి కావు. సన్నగా నాజూకుగా ఉంటుంది. గురు ముఖంగా నేర్చిన పాటలు కావు గాని, విన సొంపుగా కిన్నెర కంఠంతో పాడగలదు.

అయినా ఆమెకు పదహారేళ్ళు వచ్చినప్పటినుంచి పెళ్ళిచూపుల తంతు

జరుగుతూనే ఉన్నది. అదే వేషధారణతో ఎంతోమంది పెళ్ళికొడుకుల ముందు తల వంచుకుని కూర్చుని లేచింది.

వాళ్లు వెళ్ళగానే ముఖం ముడుచుకుని వెంటనే వేషం మార్చుకుని ఆ వస్తువులను భద్రపరచుకునేది.

అవి మళ్లీ పెళ్ళి చూపులవరకూ మెరుగులు పోకుండా పెట్టెలో పెట్టేది.

ఈ సంబంధం మాత్రం తప్పిపోదన్న నమ్మకం ఏమిటి?

ఎందరు వచ్చి చూడలేదు ?

తనను ఎన్ని ప్రశ్నలు వేయలేదు ?

తన చేత ఎన్నిపాటలు పాడించలేదు ?

ఇటూ అటూ చూసి, ఇల్లంతా కలయజూసి ఎందరు గడపదాటలేదు?

వాటిలో ఇదొకటి.

"తయారుగా ఉన్నావుటే సులోచనా!"

"అరవకమ్మా! అంతా అయింది"

"వాళ్లు వచ్చారే. సుబ్బయ్య వెంటబెట్టుకు వచ్చాడు. కాఫీ చేసి కప్పుల్లో పోశాను. నీవు రావటమే ఆలస్యం"

సులోచన ముఖం చిట్లించింది మళ్లీ.

"నవ్వు ముఖంతో రావాలి. వాళ్లేదయినా అడిగితే మర్యాదగా జవాబు చెప్పాలి."

"అబ్బా, ఈ పాఠాలు విన్నవే కదమ్మా మరిచిపోలేదు" వచ్చి వాళ్ళ కెదురుగా చాపమీద కూర్చుంది.

పెళ్ళి కొడుకు మురళి అమ్మాయినే కన్నార్పకుండా చూస్తున్నాడు.

"అమ్మాయి కుటుంబం మంచిది. తండ్రి పండితుడు. ఆయన మంచి తనంతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాడు. పిల్లకు పెళ్ళిపెళ్ళి అను

కుంటూ ఉండగానే విషజ్వరం వచ్చి మరణించాడు. అమ్మాయి తల్లి పార్వతమ్మ ఈ యింట్లో ఒక భాగం అద్దెకిచ్చి గుంభనంగా కాలక్షేపం చేస్తున్నది."

ఇద్దరూ తలలు వంచుకుని వింటున్నారు.

"అమ్మాయి ఉంది చూశారూ ? పేరు సులోచనకు తగ్గట్టుగా పెద్దపెద్ద కళ్ళు-కడిగిన ముత్యంలా ఉంటుంది పిల్ల. ఇంట్లో తిరుగుతూ ఉంటే మహాలక్ష్మిలా ఉంటుంది. పనీపాటా వచ్చు. వినయవిధేయతలూ మర్యాదా మంచీ తెలిసినపిల్ల. ఇంటి కోడలికి తగిన మంచి లక్షణాలన్నీ ఉన్నాయి."

పెళ్ళికొడుకు ముఖంలో చిరునవ్వు మొలకలెత్తింది.

సులోచన పెళ్ళికొడుకును చూసీచూడనట్టుగా చూసింది. "చూపులు కాదుగా ముఖ్యం షరతులుగాని" అనుకుంటూ.

"అయ్యా, అమ్మాయిని ఏమయినా మాట్లాడిస్తారా ? పాటపాడమంటారా?" అడిగాడు సుబ్బయ్య.

''ఎందుకులెండి'' తరువాత ఏం మాట్లాడాలో తలవంచుకుని ఆలోచిస్తున్నారు యిద్దరు.

''వాళ్ళిద్దరూ నోరు విప్పరేం ? ఏమిటీ ఆలోచన ?" సులోచనకు అలా వాళ్ళముందర బొమ్మలా కూర్చోటం విసుగ్గా ఉంది.

నిశ్శబ్దం తారట్లాడింది కొంతసేపు.

వాళ్ళ మాటలు వినాలని పార్వతమ్మ తలుపుచాటున చెవులు దోరగిల పెట్టుకుని నిలబడ్డది.

వచ్చినవాళ్ళలో ఒకాయన నోరు విప్పాడు.

''అబ్బాయికి రెక్కలే ఆధారమయినా అతడిమీద ఆధారపడిన వాళ్ళెవరూ లేరు. ఇంటరు పాసయి బి.ఏ. ప్రయివేటుగా చదువుతున్నాడు. ఒక షాపులో లెక్కలు రాయటానికి కుదిరాడు."

ఇంతేనా అన్నట్టు చూశాడు సుబ్బయ్య.

రెండోఆయన అందుకున్నాడు-''పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు. చాలా ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టాడు. ఇంటర్వ్యూకి పిలిస్తే సెలక్టు అవుతాడు. ఎటు

వంటి ఉద్యోగమయినా చెయ్యగల శక్తిసామర్థ్యాలు గలవాడు. చాకులాంటి పిల్లవాడు కదండీ ?''

అంతవరకూ ఈ సంభాషణలు వింటూకూడా తనకు ప్రమేయంలేకున్నా నిగ్రహించుకుని కూర్చున్న సులోచన నవ్వకుండా ఉండలేకపోయింది.

''అలా నవ్వుతావేమిటమ్మా ? అబ్బాయి సామాన్యుడనుకున్నావా ?'' అన్నాడు ధీమాగా. సులోచన నవ్వినందుకు ఆయన అభిమానం దెబ్బతిన్నట్టయింది.

తను చెప్పటంలో ఏమయినా లోపముందా ? అన్న ఆలోచన మనసులో మెదిలింది.

''ఇంతకూ మీరు చెప్పదలచుకున్నదేమిటి ? అదేదో స్పష్టంచేయండి" అన్నాడు సుబ్బయ్య.

''ఎట్లాగయినా మగపిల్లవాడు కదండీ ? యథాప్రకారంగా అందరిలాగే అతడికీ కట్నమూ లాంఛనాలూ కావాలి?" అన్నాడు సమాధానంగా. ఆ యిద్దరిలో ఒకాయన.

''అదే-ఎంతని ?"

"పిల్లవాడు చిన్నవాడు. అభివృద్ధిలోకి రావలసినవాడు. దేనికయినా పెట్టుబడి అవసరమైననాడు. ఏమయ్యా, నీవే పెద్దరికం వహిస్తావనుకుంటే మాట్లాడకుండా కూర్చున్నావు ?" అన్నాడు రెండవఆయన వైపుతిరిగి.

ఆయన ఆలోచిస్తున్నాడు. తనకు విస్తట్లోకి అన్నం రావాలంటే తెల్లవారురూమున స్నానంచేసి బొట్టుపెట్టుకుని, పెద్దలనాటి చెంబు చేతబట్టుకుని, ప్రతి యింటిముందరా నిలబడి "సీతారామా భ్యాన్నమహీ" అంటేగాని చెంబునిండదు. చెంబునిండితేగాని ఇంట్లో కడుపులు నిండవు. తను ఇంతవరకూ ఏభయిరూపాయల నోటు కళ్ళచూడలేదు. ఎంత అడగవచ్చు ? ఎంత అడిగితే బాగుంటుంది ? దానిలో తనకెంత ? అన్న ఆలోచనలో ఉన్నాడు.

ఆలోచన తెగలేదు.

''వాళ్ళ మాటలు తనకు తెలియకపోతాయా'' అనుకుంటూ సులోచన లేచి లోపలికి వెళ్ళిపోయింది.

హితచింతకులిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"సరే అమ్మాయిని చూశాం కదా. ఒకటి రెండు రోజుల్లో మళ్ళీవచ్చి చెబుతాం.'' కాబోయే పెళ్లికొడుకుతో కూడా వెళ్ళారు.

ఇది జరిగి దాదాపు రెండేళ్ళయింది. సులోచన ఈలోపుగా మూతిముడుచుకునే పెళ్ళిచూపులచీరె, చేతి గాజులూ చెవులకు కమ్మలూ మెళ్ళోదండ అలంకరించుకుని పెళ్ళిచూపులకు చాపమీద కూర్చుంటునే ఉంది.

కాని అదివరకట్లంటె ధైర్యాన్ని పుంజుకుంది.

అంతలో మధ్యంతర ఎన్నికలొచ్చాయి. ఓటువేసే హక్కు ప్రతివ్యక్తికీ ఉన్నదని నినాదాలు జ్ఞాపకంచేస్తున్నాయి. పోలింగ్‌బూత్‌ల ముందర స్త్రీల క్యూ పురుషుల క్యూ ఉదయం ఏడు గంటలనుంచీ ఏర్పడ్డది.

స్త్రీల లైనులో సులోచన రెండవది. పురుషుల లైను చాలా పొడుగ్గాఉంది. వేళకాగానే ముందు పురుషుల క్యూ కదలటం మొదలుపెట్టింది.

సులోచన తన పెళ్లిచూపులకు వచ్చిన పెళ్లికొడుకులను కొందరిని గుర్తుపట్టగలదు. మురళిని చూసిన కొంతసేపటికి గుర్తుపట్టింది. మురళి క్యూలో రెండవవాడు. అతడు ఓటువేసి వెళ్ళిపోయాడు.

అది కనిపెట్టిన సులోచన అతడివెనకే, క్యూ వదలిపెట్టి వెళ్ళింది. రెండు సందులు దాటిన తరువాత, అతడిని కలుసుకుంది. కాని-అతడు గుర్తుపట్టిన ఛాయలు కనబడలేదు.

ఎదురుగా నిలబడ్డ తరువాత ఏం మాట్లాడాలో ఆమెకు తోచలేదు.

''నాతో ఏమయినా పనుందా దారికడ్డంగా నిలబడ్డారు ?'' అన్నాడు అతడే.

''ఏంలేదు. మా అమ్మకు ఒంట్లో బాగాలేదు. మందుతేవాలని వెళ్తున్నాను. ఎటువెళ్ళాలో తెలియక నిలబడిపొయ్యాను''

''అలాగా ? మీరు ఓటువేసి వెళ్ళచ్చుగా ! టైమయిపోతుంది మళ్ళీ మీరు తిరిగి వచ్చేవరకు ?''

"అంత తొందరగా ?''

''మందుకొని ఇంటికివెళ్ళి ఆమె కివ్వాలికదా. అదీగాక ఇప్పుడు దుకాణాలు తెరవరు. ఇవాళ అసలే తెరవరు" అన్నాడు.

"ఏమో ? మా అమ్మకు జబ్బుగా ఉంది. నాకు మతిపోయినట్టుగా ఉంది."

"అయితే మీరు ఓటువెయ్యరా ? అది మీ బాధ్యత. వేసి తీరాలి."

"ఆఁ. నా ఓటొకలెక్కా అంతమందిలో ? ఓటువేస్తే నా బాధలు తీర్తాయా ?''

"బాధలు తీరకపోవచ్చు. కాని బాధ్యతను నెరవేర్చిన వారవుతారు."

"బాధ్యత అంటే ఏమిటో ? నేను ఇరవైఏడుసార్లు పెళ్ళిచూపులకు కూర్చు న్నాను. ఇరవై ఏడు మందిలో ఏ ఒక్కరైనా ఓటువేశారా ? లేదు. క్యూలో నిల బడి వెళ్ళిపోయారు తిరిగి చూడకుండా. అన్నట్టు మీకు దేనికయినా ఇంటర్వ్యూ కార్డు వచ్చిందా ?"

"ఇంటర్వ్యూ దేనికండీ ?"

"ఉద్యోగానికి''

"చదువుంటే కదండీ ఉద్యోగమూ ఇంటర్వ్యూను ?"

''అయితే ఇంటరు ప్యాసయి ప్రైవేటుగా బి.ఏ చదవటమూ, ప్రైవేటుగా ఉద్యోగం చెయ్యటమూ . . .''

"అంత అదృష్టమా ? ఆచదువూ లేదు-ఆ ఉద్యోగమూ లేదు" అతడికి కొద్దికొద్దిగా జ్ఞాపకం వస్తోంది.

"అయితే అసలే చదువురాదా ?"

"ఏదో కొద్దిగా"

"మీతో వచ్చినవాళ్ళు ?''

"వాళ్ళు నా హితచింతకులు. వాళ్ళపంచలో పడుకుంటాను. ఏదయినా పనిచేసి ఆ డబ్బుతో హోటల్లో భోజనం చేస్తాను"

"ఆ యిల్లు పెళ్లికొడుక్కి కట్నంగా రాసివ్వమని తరువాత వచ్చి అడిగారట వాళ్లిద్దరూ మా అమ్మను"

''మీ అమ్మగారేమన్నారు ?"

''ఏమంటుంది ? ఆ యిల్లు మాదయితేగా ?"

అతడు సిగ్గుతో తలవంచుకున్నాడు తనతో వచ్చినవాళ్లు చేసినపనికి.

''మిమ్మల్ని చూపించి ఇల్లు రాయించుకోవాలని ఎత్తువేశారు. నా కలా అనిపించింది. నిజమే కదూ ?" సులోచన నిలవతీసింది.

''అంతే అయుంటుంది. నేనిప్పుడు వాళ్ళపంచలో పడుకోవటంలేదు.''

"మరెక్కడ మీ మకాం ?"

''అక్కడ రావిచెట్టు చుట్టూ రాతికట్టడం కట్టారు. నా పడక అక్కడ, అయితే మీ సుబ్బయ్య కూడా అబద్ధాలు చెప్పినట్లనిపించింది నిజమేనంటారా ?''

"రెండుపక్షాలూ సమానంగా తమతమ ప్రతిభను చూపించుకున్నాయి. అయితే మీరు ఎండకుఎండి వానకు తడుస్తున్నారన్న మాట."

అతడు మౌనం వహించాడు.

''బ్రతుకుతెరవును గురించి ఆలోచించటం లేదా?"

''ఒకపెద్ద ఆసామీ టికొట్టు పెడుతున్నాడు. నన్ను ఆ కొట్లో పని చేయమన్నాడు."

''అంతేనా ? అదీ మీ స్వంతం కాదన్నమాట ?''

"నా స్వంతం అన్నది మనిషిగా నేను"

"మీ టీ కొట్టాయనను నాకు పరిచయం చేస్తారా ?"

''దానికేం? నాతోరండి''

ఇద్దరూ సందుదాటి రోడ్డుమీదికి వచ్చారు. మొదటి ఇల్లు ఆసామిది. వెళ్ళి ఎదురుగా నిలబడ్డారు.

''రేపు మంచిరోజని చెప్పాను కదయ్యా'' అన్నాడు.

"అందుక్కాదండి. ఈ అమ్మాయి టీ కొట్టులో గ్లాసులు కడుగుతానని మీ దగ్గరికి తీసుకెళ్ళమని అడిగిందండి"

"ఏమ్మా? నీవాపని చేయగలవా?"

"చేస్తానండి''

"అయితే నీవు పనిలోకి ఆరుగంటలకు చీకటితో రావాలి. రాత్రి పదకొండు గంటలవరకూ ఉండి పనిచేయాలి. గ్లాసులు పగలగొట్ట కూడదు. జాగ్రత్తగా పని చెయ్యి. నెలకు నూరు రూపాయలు ఇస్తాను అదీ నీపని చూసి. నాగా పెట్టకూడదు. తెలిసిందా?"

''నాగా పెట్టనండి. కాని నాదొక షరతుందండి. మా అమ్మ పెద్దది. ఆమెకు వంటచేసి తినిపించి పదిగంటలకు వచ్చి సాయంకాలం ఐదింటికి వెళ్ళిపోతాను''

"మా టీ వ్యాపారం పొద్దున ఆరుగంటల నుండి, రాత్రి పదకొండు గంటల వరకూ సాగుతుంది.''

"అలా అయితే మా అమ్మ పంపదండి''

"ఎందుకు పంపదూ? మరి డబ్బెట్లా వస్తుంది?

సులోచన తలవంచుకుని ''పెండ్లి కాని పిల్ల చీకటిపడేవరకూ ఉండకూడదంటుంది'' అన్నది.

''ఓహో! అదా సంగతి? అయితే తొందరగా పెళ్ళి చెయ్యమను''

''ఎవరూ ఓటు వెయ్యటం లేదండి ఎందరో వచ్చారండి. ఈయన కూడా వచ్చారండి ఇద్దరు మోసగాళ్ళతో. ఏం లాభంలేదండి"

"ఏమోయ్ మురళీ,నీవూ చూశావా? ఏంలోపం కనిపెట్టావు ఈ అమ్మాయిలో? మహాలక్ష్మిలా ఉంటే ఎందుకు కాదన్నావు?''

"నే ననలేదండి.''

''నీవనకపోతే ఇప్పుడు చేసుకో. మీ కిద్దరికీ జోడు సరిపోయింది. ఏమ్మా నీకిష్టమే కదూ?"

''నాకెప్పుడూ ఇష్టమేనండి. అయితే పెళ్ళి చేసేవాళ్లు లేరండి. అసలు మాకు పెళ్ళి చూపులయి చాలా ఏళ్ళయిందండి''

''మీ యిద్దరి పరిస్థితులూ ఒక మాదిరిగానే ఉన్నాయి. ఇద్దరూ ఇష్టపడు తున్నారు. రేపు పొద్దున మీ కిద్దరికి సూర్యోదయంతోపాటు గుళ్లో పెళ్ళి. సరేనా?'' ఇద్దరి ముఖాలవంకా చూశాడు.

"నాదొక చిన్న మనవండి నేనిక్కడే ఉండాలంటే మా అమ్మకూడా ఉండాలండి. ఆమెకు నేను తప్ప ఎవరూలేరు. ఉండటానికి జాగా చూపించండి'' చేతులు జోడించింది.

''మీ అమ్మకు ఆపంచ, మీకు టీ కొట్టు సరిపోతుందా?''

"మాకిదే గొప్ప అదృష్టమండి. కాని ఆయన ఆ పంచను రాసి ఇమ్మంటే పెద్ద చిక్కు వస్తుంది కదా?"

"అనకుండా నేను చూస్తాగా. అయినా ఆ పంచ ఆయనది కాదుగా?''

"కాకపోయినా పెళ్ళికొడుకు గదండీ. అడుగుతాడేమో? ఆయన కాక మరెవరిచేతనయినా అడిగిస్తే?''

"వాళ్ళను నా వెంబడి తీసుకురావటం పొరబాటయింది. ఇంక నీవూ నేనూ ఇద్దరమే మాట్లాడుకుందాం" క్షమాపణ చెప్తున్నట్టుగా అన్నాడు. మురళి తల వంచుకుని.

ఉరుకు పరుగులమీద సులోచన యింటికి వెళ్ళి ''అమ్మా, నాకు పెళ్ళి కుదిరింది. రేపు పొద్దున్నే గుడిలో దేవుడి ముందర ఆనామిగారు చేస్తానన్నారు.

ఆ పెళ్ళిచూపుల గాజులు నగలూ చీరె ఇంక దాచక్కర్లేదు. రేపు తలంటి పోసుకుని ఆ పెండ్లిచూపుల చీరె నగలతో వెళ్తే ఆసామిగారే మాకు బట్టలిచ్చి పెండ్లి చేస్తారు గుళ్లో. నేనువచ్చి నిన్నుకూడా అక్కడికే తీసుకు పోతాను.

"వరుడెవరే?"

"రేపు చూపిస్తాగా. నీవు చూసిన ఆయనే. ఆలస్యంగా ఓటు వేశాడు."